

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

సంపుటి:-01, సంచిక:-139, శుక్రవారం 16-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

ఐటీ అండ.. ఫార్మా దెబ్బ.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

- లాభాల స్వీకరణతో నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 252 పాయింట్లు, నిఫ్టీ 99 పాయింట్లు నష్టం
- ఫార్మా, హెల్త్‌కేర్ షేర్ల అమ్మకాల ఒత్తిడితో సూచీలు పతనం
- మార్కెట్లకు అండగా నిలిచిన ఐటీ షేర్లు



నేడు దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగగా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) షేర్లలో కొనుగోళ్ల మద్దతు నష్టాలను కొంతమేర పరిమితం చేసింది. వరుస లాభాల తర్వాత ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు - మిగతా 2 లో

ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?.. ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు!

- ఎన్నికల ముందు ఇరాన్‌పై సైనిక చర్యకు ట్రంప్, నెతన్యాహు చర్చలు
- ఇరాన్ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తోందని నెతన్యాహు ఆందోళన
- ముందుకెళ్లండి అని చెప్పి.. సలహాదారులతో మాట్లాడి వెనక్కి తగ్గిన ట్రంప్
- సైనిక చర్యకు అమెరికా రక్షణ మంత్రి మొగ్గు, ఇతర సలహాదారుల వ్యతిరేకత



తెలంగాణను గ్లోబల్ పెట్టుబడులకు

కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- 2047 నాటికి రూ. కాదు.. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ
- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యం
- మహిళలు, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం
- పెట్టుబడిదారులకు పూర్తి సహకారం.. అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ఎజెండా
- తెలంగాణను గ్లోబల్ పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ । దేశ జీడీపీలో రాష్ట్ర వాటా 10 శాతానికి పెంపే లక్ష్యం



హైదరాబాద్:లి తెలంగాణను ప్రపంచ స్థాయి పెట్టుబడులకు గమ్యస్థానంగా

తెలంగాణలో మరో 22 పబ్లిక్ స్కూళ్లకు సర్కార్ గ్రీన్ సిగ్నల్




తెలంగాణ : రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. మరో 22 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీజీపీఎస్) ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ స్కూళ్లను మోడల్ విద్యాసంస్థలుగా తీర్చిదిద్ది, సమగ్ర మౌలిక వసతులు కల్పించేందుకు రూ.220.70 కోట్ల నిధులను కేటాయించింది. ఈ మేరకు జీవో 187, 188ను విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాణా రిలీజ్ చేశారు. ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. - మిగతా 2 లో

రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

- కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు
- వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు చేశారని విమర్శ
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం జరిగిందన్న కేటీఆర్
- సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి



జర్నలిస్టుల నిర్బంధంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంఘం



- ఢిల్లీలో పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ చీజేవీ× పిటిషన్
- జర్నలిస్టుల రాజ్యాంగ హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపణ
- గుర్తింపు కార్డు చూపించినా అదుపులోకి తీసుకున్నారని పిటిషన్‌లో ప్రస్తావన
- రెండు రోజుల్లో 35 మంది జర్నలిస్టుల నిర్బంధం.. జూజీ నివేదిక ప్రస్తావన
- నిరసనల సమయంలో వార్తా సేకరణకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి

జర్నలిస్టుల నిర్బంధంపై సుప్రీంకోర్టును - మిగతా 2 లో

సర్ పై సుప్రీంకోర్టులో ఒవైసీ పిటిషన్



- ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టుకు వెళ్లిన అసదుద్దీన్ ఒవైసీ
- నిబంధనలు పాటించకుండా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపణ
- ఈ ప్రక్రియపై స్టే విధించాలని కోర్టుకు విజ్ఞప్తి

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ - మిగతా 2 లో

కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం


- అధికారులకు తీవ్ర హెచ్చరిక
- పదేపదే చెప్పినా పరిస్థితి మారలేదని అధికారులపై అసహనం
- నిర్లక్ష్యం చేస్తే స్పెషల్ చీఫ్ సెక్రటరీ, జెన్కో సీఎండీని సస్పెండ్ చేస్తానని హెచ్చరిక
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై యూకే మేయర్ల బృందంతో సీఎం చర్చలు
- ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ఆహ్వానం



తెలంగాణలో తరచూ తలెత్తుతున్న విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల పనితీరుపై ఆయన

షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్

లాటరీలో రూ. 13 కోట్లు!



- షార్జాలో నివసిస్తున్న భారతీయుడికి బంపర్ లాటరీ
- యూఏఈ లాటరీలో రూ. 13 కోట్ల రెండో బహుమతి గెలుపు
- ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన టికెట్‌తో మారిన కిషోర్ అదృష్టం
- మొదట వార్త చూసి నమ్మలేకపోయానన్న విజేత
- ఈ డ్రాలో మొదటి బహుమతి ఎవరికీ దక్కలేదు - మిగతా 2 లో

జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం



- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు - మిగతా 2 లో

తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ

- జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపిన సీజేపీ నేతలకు ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ
- అరెస్టులను తీవ్రంగా ఖండించిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- త్రివర్ణ పతాకాన్ని ఎగరేయడం నేరం కాదని వ్యాఖ్య



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినందుకు అరెస్టయిన కాక్‌రోచ్ జనతా పార్టీ (జజ్పా) నేతలకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మద్దతుగా నిలిచారు. శాంతియుతంగా నిరసన తెలుపుతూ జాతీయ జెండాను ఎగురవేయడం నేరం కాదని, ఇందుకోసం యువతను జైల్లో పెట్టడం పిరికిపంద చర్య అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ... నిరసన ప్రదేశం కాదని ఇటీవల ప్రకటించిన జంతర్ మంతర్‌లోకి ప్రవేశించారనే ఆరోపణలపై సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్నారు. ఈ ఉదయం వారిని కోర్టులో హాజరుపరచగా... న్యాయస్థానం వారికి ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. గతంలో ఒకసారి

ఐటీ అండ.. ఫార్మా దెబ్బ.. నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

మొదటిపేజీ తరువాయి - మొగ్గు చూపడంతో మార్కెట్లు ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 251.89 పాయింట్లు (0.34%) నష్టపోయి 72,781.89 వద్ద స్థిరపడింది. అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 99.25 పాయింట్లు (0.44%) క్షీణించి 22,622.70 వద్ద ముగిసింది. నిఫ్టీ కీలకమైన 22,650 స్థాయికి దిగువన ముగియడం గమనార్హం. సెన్సెక్స్ 30 షేర్లలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ వంటివి ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నష్టపోయి సూచీపై ఒత్తిడి పెంచాయి. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఫైనాన్స్ టాప్ లూజర్లుగా నిలిచాయి. రంగాల వారీగా చూస్తే.. నిఫ్టీ ఫార్మా, నిఫ్టీ హెల్త్‌కేర్ సూచీలు అత్యధికంగా నష్టపోయాయి. అయితే, నిఫ్టీ ఐటీ ఇండెక్స్ లాభాలతో ముగిసి మార్కెట్లకు కొంత అండగా నిలిచింది. ప్రధాన సూచీలతో పాటు బ్రాడర్ మార్కెట్లు కూడా బలహీనపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.08%, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.32% మేర నష్టపోయాయి.

జర్నలిస్టుల నిర్బంధంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంఘం

మొదటిపేజీ తరువాయి - ఆశ్రయించిన మీడియా సంఘం! ఢిల్లీలో జర్నలిస్టులపై పోలీసుల చర్యలను సవాల్ చేస్తూ పిటిషన్ ఢిల్లీలో నిరసన కార్యక్రమాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులను నిర్బంధించడం, భౌతికంగా బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, అక్కడి నుంచి బలవంతంగా తరలించడం వంటి చర్యలు రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తున్నాయని ఆరోపిస్తూ నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా, ఇండియా (చీఔవీ×) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేసింది. జర్నలిస్టులపై పోలీసుల చర్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఖ), 19(1)(ల), 21లను ఉల్లంఘిస్తున్నాయని పిటిషన్‌లో పేర్కొంది. స్వతంత్రంగా వార్తలు సేకరించే జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరింది. సీనియర్ జర్నలిస్టు పరంజోయ్ గుహ ఠాకుర్తా అక్టోబర్ 10న తన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ూ×దీ) గుర్తింపు కార్డును చూపించినప్పటికీ పోలీసులు తనను అదుపులోకి తీసుకున్నారని పిటిషన్‌లో ప్రస్తావించారు. తన నిర్బంధానికి గల కారణాలు తెలియజేయలేదని, సంబంధిత పత్రాలు కూడా అందించలేదని ఆయన పేర్కొన్నట్లు వివరించారు. మరోవైపు, ఢిల్లీలో రెండు రోజుల వ్యవధిలో కనీసం 35 మంది జర్నలిస్టులను నిర్బంధించినట్లు కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (జూజీ) నివేదికను కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. నిరసనల సమయంలో వార్తా సేకరణ చేసే జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని మీడియా సంఘం కోరింది.

రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

మొదటిపేజీ తరువాయి - రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ.10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. ఇప్పటికే సింగరేణిలో జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి సైతం ముఖ్యమంత్రికి లేఖ రాసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అధికార పార్టీ నేతలు ఒకరినొకరు కాపాడుకుంటూ, కమిషన్ల కోసం సింగరేణిని కొల్లగొడుతున్నారని ఆయన మండిపడ్డారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సర్ పై సుప్రీంకోర్టులో ఒవైసీ పిటిషన్

మొదటిపేజీ తరువాయి - సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ూ×=) ప్రక్రియను ఆయన తన పిటిషన్‌లో సవాల్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి సరైన ప్రక్రియ పాటించకుండా పెద్ద ఎత్తున ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆయన తన పిటిషన్‌లో తీవ్ర ఆరోపణలు చేశారు. ఒవైసీ తరఫున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపించారు. ఈ అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి తమ పిటిషన్‌ను కూడా గురువారం విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. ఈ అభ్యర్థనను పరిశీలిస్తామని, సంబంధిత కేసులతో కలిపి విచారణ జాబితాలో చేర్చే అంశాన్ని చూస్తామని సీజేఐ తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తక్షణమే స్టే విధించాలని ఒవైసీ తన పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా ఫారం-6 దరఖాస్తులకు సంబంధించి మ్యాపింగ్ వంటి నిబంధనలు ఓటర్లకు భారంగా ఉన్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఇదే అంశంపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒవైసీ పిటిషన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి సుప్రీంకోర్టు రేపు విచారించనుంది.

కరెంట్ కోతలపై రేవంత్ రెడ్డి ఉగ్రరూపం

మొదటిపేజీ తరువాయి - నిప్పులు చెరిగారు. ఎన్నిసార్లు ఆదేశాలు ఇచ్చినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన సీఎం, అధికారులు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని, ఉన్నతస్థాయి అధికారులను సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడబోనని గట్టి హెచ్చరిక జారీ చేశారు. బుధవారం విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించిన సీఎం రేవంత్ రెడ్డి, అధికారుల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. భవిష్యత్తులో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ, ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు పూర్తిస్థాయిలో లింకేజీలు ఉన్నప్పటికీ, విద్యుత్ ఉత్పత్తి ఆశించిన స్థాయిలో ఎందుకు జరగడం లేదని నిలదీశారు. "పదేపదే చెప్పినా మీలో చలనం రావడం లేదు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఇదే నిర్లక్ష్యం కొనసాగితే ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ), జెన్‌కో సీఎండీ సహా ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. విద్యుత్ కోతలకు గల కారణాలపై తక్షణమే నివేదిక ఇవ్వాలని, సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

యూకే మేయర్లతో సీఎం భేటీ

అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మేయర్ల ప్రతినిధి బృందం కలిసింది. ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా హెల్త్‌కేర్, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్స్‌టైల్స్, పరిశోధన, తయారీ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వారికి వివరించారు. రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వ్యాపార అనుకూల వాతావరణం ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా "యూకే-ఇండియా సీఈటీఏ అండ్ రీజనల్ సినర్జీస్" అనే అంశంపై యూకే-ఇండియా బిజినెస్ కౌన్సిల్ రూపొందించిన నివేదికను సీఎం ఆవిష్కరించారు. అనంతరం, డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026"కు హాజరు కావాల్సిందిగా యూకే ప్రతినిధులను ఆయన సాదరంగా ఆహ్వానించారు.

షార్జాలో భారతీయుడికి జాక్‌పాట్.. లాటరీలో రూ. 13 కోట్లు!

మొదటిపేజీ తరువాయి - యూఏఈలోని షార్జాలో నివసిస్తున్న కిషోర్ అనే ప్రవాస భారతీయుడిని అదృష్టం వరించింది. ఆయన ఏకంగా 5 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 13 కోట్లు) లాటరీ గెలుచుకున్నారు. యూఏఈ లాటరీలో రెండో బహుమతిని ఆయన సొంతం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్టోబర్ 3న యూఏఈ లాటరీ నిర్వాహకులు డ్రా తీశారు. ఈ డ్రాలో కిషోర్ కొనుగోలు చేసిన టికెట్‌కు రెండో బహుమతి దక్కింది. ఆయన అధికారిక వెబ్‌సైట్ ద్వారా 50 దిర్హమ్‌లు (సుమారు రూ. 1300) వెచ్చించి ఈ టికెట్‌ను కొనుగోలు చేశారు. లాటరీ ఫలితాలు వెలువడిన తర్వాత, విజేతల జాబితాలో తన పేరు చూసి మొదట నమ్మలేకపోయానని కిషోర్ తెలిపారు. ఆ తర్వాత తన వద్ద ఉన్న టికెట్ నంబర్‌తో సరిచూసుకుని, విజేతను తానేనని నిర్ధారించుకున్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఈ లాటరీ డ్రాలో 30 మిలియన్ దిర్హమ్‌ల (సుమారు రూ. 78 కోట్లు) భారీ జాక్‌పాట్‌ను ఎవరూ గెలుచుకోలేదని నిర్వాహకులు తెలిపారు. కిషోర్ లాటరీ గెలిచిన విషయాన్ని యూఏఈ లాటరీ నిర్వాహకులు అధికారికంగా ప్రకటించారు. ఒక్క లాటరీ టికెట్‌తో రాత్రికి రాత్రే కోటీశ్వరుడైన కిషోర్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఎన్నికల ముందు ఇరాన్‌పై దాడి?.. ట్రంప్, నెతన్యాహు మధ్య రహస్య చర్చలు!



మొదటిపేజీ తరువాయి - ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇరాన్‌పై కొత్తగా సైనిక చర్య చేపట్టే అంశంపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు విశ్వసనీయ వర్గాల కథనాలు వెల్లడిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు మధ్య గత వారం ఈ కీలక సంభాషణలు జరిగినట్లు పలువురు అధికారులు తెలిపారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలను కమ్ముకునేలా చేస్తోంది. ఇజ్రాయెల్ నిఘా వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్ తన అణు కార్యక్రమానికి సంబంధించిన కొన్ని భాగాలను పునరుద్ధరించే ప్రయత్నాల్లో ఉందని నెతన్యాహు, ట్రంప్‌కు వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'పికాక్స్ మౌంటెన్' వంటి ప్రదేశాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక చర్యను పునఃప్రారంభించేందుకు నెతన్యాహు తీవ్ర ఆసక్తి చూపారని, దీనిపై ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని ట్రంప్ ఆయనకు చెప్పినట్లు ఒక అమెరికా అధికారి పేర్కొన్నారు. అయితే, ట్రంప్ దీనిపై ఎటువంటి కచ్చితమైన హామీ ఇవ్వలేదని సమాచారం. మొదట ఈ ఆలోచనకు ట్రంప్ సానుకూలంగా ఉన్నప్పటికీ, తన సలహాదారులతో సంప్రదించిన తర్వాత వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, సెంట్రల్ కమాండ్ నాయకత్వం సైనిక చర్యకు మొగ్గు చూపగా, ట్రంప్ సలహాదారుల్లో మెజారిటీ సభ్యులు మాత్రం ప్రస్తుతానికి ఆర్థిక ఆంక్షల ఒత్తిడిని కొనసాగించడమే మేలని సూచించినట్లు సమాచారం. అమెరికా మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేయబోమని ట్రంప్ బహిరంగంగా ప్రకటించడానికి ముందే ఈ చర్చలు జరగడం గమనార్హం. ఈ పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. ఇజ్రాయెల్‌లో అక్టోబర్ 27న, అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ఇలాంటి సమయంలో ఇరాన్‌పై భారీ సైనిక చర్యకు దిగితే, అది రెండు దేశాల ఎన్నికల్లోనూ ప్రధాన ప్రచారాంశంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాల వైఖరిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే, ఈ వార్తలను వైట్‌హౌస్ ఖండించింది. మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై ఎటువంటి దాడి ఉండదని అధ్యక్షుడు స్పష్టం చేశారని, యుద్ధాన్ని పునరుద్ధరించే అంశంపై నేతలు చర్చించలేదని పేర్కొంది. మరోవైపు, నెతన్యాహు కార్యాలయం స్పందిస్తూ.. ట్రంప్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ధ్రువీకరించింది. కానీ, చర్చల సారాంశంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించింది. ఏది ఏమైనప్పటికీ, భవిష్యత్తులో అధ్యక్షుడి నుంచి ఆదేశాలు వస్తే వెంటనే స్పందించేందుకు ఇజ్రాయెల్ సైన్యం, అమెరికా సెంట్రల్ కమాండ్ పూర్తిస్థాయిలో సన్నాహాలు పూర్తిచేసి అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది.

నా లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు.. వాటిని మెడల్స్ గా భావిస్తా



కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తన లక్ష్యం 100 ఎఫ్ఐఆర్‌లు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్ని ఎఫ్ఐఆర్ లు నమోదు చేసుకున్నా తానేమీ వెనుకంజ వేయబోనని, ఆ కేసులను మెడల్స్ గా భావిస్తానని అన్నారు. సీఈసీ పదవికి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందేని పునరుద్ఘాటించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నేడు జన్‌పథ్‌లోని సాగర్ రత్న రెస్టారెంట్‌లో విపక్ష ఎంపీల భోజన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, 'ఓట్ల దొంగతనం' అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఇదే సమావేశంలో ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా మాట్లాడుతూ.. 'ఇది లంచ్ మాత్రమే కాదు, ఒక లాంచ్ కూడా కావచ్చు' అని చమత్కరించారు. కాగా, మంగళవారం 'ఓట్ల దొంగతనం' జరిగిందంటూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిన్న విపక్ష ఎంపీలు ఎన్నికల సంఘం కార్యాలయానికి ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు నేతలు ఆకాశవాణి భవన్‌లోకి ప్రవేశించి సుమారు 8 గంటల పాటు బైఠాయించారు. అనుమతి లేకుండా భవనంలోకి ప్రవేశించినందుకు పోలీసులు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్‌పై స్పందిస్తూ రాహుల్ గాంధీ, "నాపై ఇప్పటికే 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. నా లక్ష్యం 100" అని తేలికగా వ్యాఖ్యానించారు. భోజన భేటీ అనంతరం, ఎంపీలందరూ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపేందుకు సిద్ధంగా ఉన్న బస్సుల్లో బయలుదేరారు. మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్, జ్ఞానేశ్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో, పోలీసులు జంతర్ మంతర్, ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లే మార్గాల్లో భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు.

తెలంగాణను గ్లోబల్ పెట్టుబడులకు కేంద్రంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి - తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన, 'తెలంగాణ రైజింగ్--2047' విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను వివరించారు. రాష్ట్రాన్ని 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా సుమారు 5 శాతంగా ఉందని, దానిని 10 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

CURE, PURE, RARE ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణను మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రేవంత్ రెడ్డి వివరించారు.

జఖ=జు:లి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ప్రాంతాన్ని ఐటీ, సేవారంగం, అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు.

ూాఖ=జు:లి ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యనున్న ప్రాంతంలో తయారీ పరిశ్రమలు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ రంగాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

=ాా=జు:లి గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా వ్యవసాయం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, గ్రామీణ ఉపాధి అవకాశాలను పెంచనున్నారు.

పెట్టుబడిదారులకు పూర్తి భరోసా

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అవసరమైన సహకారం, రక్షణ కల్పిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక పారిశ్రామికవేత్తలు కూడా నూతన పారిశ్రామిక విధానంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటివరకు చాలామంది స్థానిక పెట్టుబడిదారులు కార్పొరేట్ సంస్థలకు సేవలు అందించే రంగాలపై దృష్టి సారించారని పేర్కొంటూ, ఇకపై మన ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్తలు స్వయంగా పెట్టుబడులు పెట్టి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



అభివృద్ధే ప్రధాన ఎజెండా

2047 నాటికి భారత్ స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తిచేసుకోనుందని సీఎం గుర్తుచేశారు. అప్పటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్--2047' లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాల సహకారం కీలకమని అన్నారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని, మిగతా సమయంలో అభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని అభిప్రాయపడ్డారు. సుమారు 400 ఏళ్ల చరిత్ర కలిగిన చార్మినార్ హైదరాబాద్‌కు గుర్తింపుగా నిలిచిందని, అనంతరం హైటెక్ సిటీ ప్రపంచ పెట్టుబడులకు మరో కీలక కేంద్రంగా అవతరించిందని సీఎం పేర్కొన్నారు. ఇదే తరహాలో తెలంగాణను మరింత అభివృద్ధి చేసి అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

మహిళల ఆర్థిక స్వావలంబనకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రేవంత్ రెడ్డి తెలిపారు. మహిళలకు రూ.61,000 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని పేర్కొన్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల యజమానులుగా, పెట్రోల్ బంకుల నిర్వాహకులుగా, సౌర విద్యుత్ ప్లాంట్లలో భాగస్వాములుగా ఎదిగేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు మహిళలు, యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలని సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు.

యువతకు స్ఫూర్తిగా విజయగాథలు

పూర్వం వస్తు మార్పిడి విధానం నుంచి నేటి ఆధునిక వ్యాపార పద్ధతుల వరకు వాణిజ్య రంగం అనేక మార్పులకు లోనైందని సీఎం పేర్కొన్నారు. ఈ మార్పులను అర్థం చేసుకుంటూ కొత్త వ్యాపార విధానాలను అనుసరించడంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన పలువురు సినీ, రాజకీయ రంగాల్లో వివిధ స్థాయుల్లో రాణిస్తూ ఉన్నత స్థానాలకు చేరుకున్నారని సీఎం ప్రస్తావించారు. ఇలాంటి విజయగాథలను నమోదు చేసి, భవిష్యత్ తరాలకు అందించాలని ఛాంబర్ ప్రతినిధులకు సూచించారు. కొత్త తరం అభివృద్ధికి, పారిశ్రామిక రంగ విస్తరణకు వేదికగా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించిన నిర్వాహకులను సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యాల సాధనలో ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు, స్థానిక వ్యాపారులు, మహిళలు, యువత కలిసి ముందుకు సాగాలని సీఎం పిలుపునిచ్చారు.

జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం



మొదటిపేజీ తరువాయి - మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

తీహార్ జైలుకు వెళ్లిన సీజేపీ నేతలకు బాసటగా రాహుల్ గాంధీ



మొదటిపేజీ తరువాయి - అరెస్టయి, శాంతి ఒప్పందం (పీస్ బాండ్)పై సంతకం చేసి విడుదలైన వీరు... ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించినందున కస్టడీకి పంపినట్లు పోలీసులు తెలిపారు. వీరితో పాటు అరెస్టయిన అజింక్యా షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. ఈ అరెస్టులపై రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "జంతర్ మంతర్ భారత ప్రజలది. దానిని మేం తిరిగి స్వాధీనం చేసుకుంటాం. విద్యార్థులు, యువత, జర్నలిస్టులు, ఇండియా కూటమి.. అందరిదీ ఒకే లక్ష్యం. అదే పౌరుల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ" అని పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు అరవింద్ కేజ్రీవాల్, ఎంకే స్టాలిన్, అభిషేక్ బెనర్జీ, ఆదిత్య థాకరే వంటి పలువురు విపక్ష నేతలు కూడా ఈ అరెస్టులను ఖండించారు. తమకు మద్దతు ప్రకటించినందుకు రాహుల్ గాంధీకి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ధన్యవాదాలు తెలిపారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం వద్దు

రాజధాని పనులపై చంద్రబాబు సమీక్ష.. కీలక ఆదేశాలు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. రాజధాని ప్రాంతంలో ప్రతి నెలా కనీసం రూ. 2 వేల కోట్ల విలువైన పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పురపాలక శాఖ మంత్రి పి. నారాయణతో పాటు వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. గత నెలలో రాజధాని పరిధిలో రూ. 1,345 కోట్ల విలువైన పనులు పూర్తయినట్లు అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదించారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా చేరుకోవాలంటే పనుల వేగాన్ని మరింత పెంచాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం అమరావతిలో 152 ప్రాజెక్టులకు సంబంధించి సుమారు 41 వేల మంది కార్మికులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని మంత్రి నారాయణ వివరించారు. వివిధ నిర్మాణ సంస్థలు చేపట్టిన పనుల పురోగతిని సీఎం స్వయంగా ఆరా తీశారు. రాజధాని అభివృద్ధిలో కీలకమైన ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ప్రాజెక్టు పనులను త్వరితగతిన పట్టాలెక్కించాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చోటుచేసుకోకూడదని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి



బడంగ్పేట్,అక్టోబర్ 15(విజన్ పక్షం): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన చిగురింత పారిజాత నరసింహారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బాలాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నీరుడి శ్రీరాములు గాంధీభవన్‌లో పారిజాత నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నీరుడి శ్రీరాములు మాట్లాడుతూ... పారిజాత నరసింహారెడ్డి నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె మార్గదర్శకత్వంలో శ్రమిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



గండిమైసమ్మ,అక్టోబర్15(విజన్ పక్షం దినపత్రిక): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బతుకమ్మ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకట మణికరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో కార్యాలయ మహిళా ఉద్యోగులు,పొదుపు సంఘాల మహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు.మహిళలందరూ తంగేడు, టేకు పువ్వు,గునుగు,బంతి,చామంతి,మారేడు పూలతో బతుకమ్మలను పేర్చి అందంగా అలంకరించారు.అనంతరం కార్యాలయ ఆవరణలో మహిళలంతా బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో బతుకమ్మ సంబరాల్లో ఆనందంగా గడిపారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మణికరన్ మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల మేళవింపుకు ప్రతీక బతుకమ్మ పండుగ,ఐక్యతను చాటి చెప్పే తెలంగాణ వారసత్వ పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు...

బ్యాతల శివశంకర్ మాదిగ కుటుంబాన్ని పరామర్శించిన మంద కృష్ణ మాదిగ





శంకర్ పల్లి, అక్టోబర్ 15(విజన్ పక్షం): గురువారం టంగుటూరు గ్రామానికి చెందిన ఎంఆర్పిఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివ శంకర్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ సందర్భంగా ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ వారి కుటుంబాన్ని పరామర్శించి, శివ శంకర్ మాదిగ కుటుంబానికి ఎం ఆర్ పి ఎస్ అండగా ఉంటుందాన్ని, వారికి ఇందిరమ్మ ఇల్లుని ప్రభుత్వం ఇవ్వాలని, భూమి కోసం పోరాడి, అయన ప్రాణాలను కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఒక మంచి నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్, మీర్సా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు రావుగాళ్ల బాబు,వీర్సా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు పెంటగోళ్ల నర్సింహా, వీర్సా రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ, మాజీ ఉపాధ్యక్షులు కడిగాళ్ళ ప్రవీణ్, మీఖీ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు నాని భానుప్రసాద్, ప్రవీణ్, మహేందర్, మల్లేష్, కుమార్ లింగం సాయి,సతీష్, నాగేష్,వివిధ మండలల నాయకులు,గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జరుగుతున్న దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

జీడిమెట్ల,అక్టోబర్15(విజన్ పక్షం): జీడిమెట్ల డివిజన్ పరిధిఎంఎన్ రెడ్డి నగర్ లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహ మండపంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు..అమ్మవారి పూజా కార్యక్రమాలకు బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి,కుంటా సిద్ధిరాములు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...దుర్గామాత అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరి జీవితంలో సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆలయకమిటీ అధ్యక్షుడు కర్ణే శామ్, వైస్ ప్రెసిడెంట్ విఠల్ నాయక్, జనరల్ సెక్రటరీ ఎల్లాగౌడ్, ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుంట సిద్ధిరాములు,చంద్రశేఖర్ రెడ్డి ,వివిదకాలనీలకు చెందిన నాయకులు , స్థానిక కాలనీవాసులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గాజులరామారం డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్

ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, రావుల శేషగిరిలకు కృతజ్ఞతలు తెలిపిన సాయిప్రతాప్

పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడి





గాజులరామారం,అక్టోబర్15(విజన్ పక్షం దినపత్రిక): భారతీయ జనతా పార్టీ(బీజేపీ) గాజులరామారం డివిజన్ నూతన అధ్యక్షుడిగా సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన తనకు అవకాశాన్నిచ్చిన్న పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో డివిజన్ అధ్యక్ష బాధ్యతలను అప్పగించినందుకు గాను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు గిరివర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కో-కన్వీనర్,మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిలను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి ధన్యవాదాలు తెలిపారు. శాలువాతో సత్కరించి నాయకులు న సాయిప్రతాప్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన మార్గదర్శకత్వం అందించారు.

పార్టీ అభివృద్ధి కోసం పాటుపడతాను.

ఈ సందర్భంగా సుంకరి సాయిప్రతాప్ ముదిరాజ్ మాట్లాడుతూ... "నాపై నమ్మకం ఉంచి గాజులరామారం(278)అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అగ్రనాయకత్వానికి,జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దల ఆశీస్సులు, నాయకుల మార్గదర్శకత్వంలో డివిజన్ పరిధిలో బీజేపీని మరింత బలోపేతం చేస్తాను. ప్రతి కార్యకర్తను కలుపుకొని పోతూ,ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీ వికాసానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు గరిగే శేఖర్ ముదిరాజ్,పట్లోళ్ల శ్రీనివాస్ రెడ్డి,రాజు యాదవ్,దమ్మని యశ్వంత్ ,తెల్ల బాల్ రాజ్ లు డివిజన్ పరిధిలోని పలువురు బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు అభిమానులు పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

ఖానాపూర్‌లో ఎలాంటి కుల వివక్ష లేదు రాజకీయ స్వార్థం కోసమే మా పేరిట వివాదాలు

చేవెళ్ల ఆర్డీవోకు గ్రామస్తుల వినతి

చేవెళ్ల,అక్టోబర్ 15, విజన్ పక్షం దినపత్రిక: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు మొదటినుంచీ ఐక్యమత్యంగా, పరస్పర గౌరవంతో కలిసిమెలిసి జీవిస్తున్నారని, గ్రామంలో ఎలాంటి కుల వివక్ష లేదని స్థానిక ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న వివాదాస్పద పరిణామాలతో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చిచెబుతూ, కొందరు వ్యక్తులు తమ స్వార్థ రాజకీయాల కోసం దళితులను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపిస్తూ చేవెళ్ల ఆర్డీవో గారికి గురువారం లిఖితపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరతరాలుగా గ్రామంలోని అన్ని కులాల ప్రజలు సోదరభావంతో ఉంటూ పండుగలు, శుభకార్యాలను కలిసికట్టుగా జరుపుకుంటున్నామని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత, రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఎస్సీ వర్గాన్ని అడ్డం పెట్టుకుని గ్రామంలో అల్లర్లకు పాల్పడుతూ, ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఎక్కడా లేని కుల వివక్షను ఉన్నట్లుగా చిత్రీకరిస్తూ, ఇటీవల పత్రికలలో 'ఎస్సీ కాలనీ' పేరిట తప్పుడు ప్రకటనలు ఇప్పించి ఊరి పరువు తీయడంతో పాటు తమ సామాజిక వర్గాన్ని సమాజంలో చులకన చేసి అవమానపరుస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజల మధ్య చిచ్చుపెట్టి గ్రామంలోని శాంతిసామరస్యాలను చెడగొట్టేందుకు కొందరు పన్నుతున్న కుట్రలను గ్రామస్తులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులు ఇలాంటి రాజకీయ ప్రేరేపిత తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, గ్రామంలోని వాస్తవ పరిస్థితులను పరిశీలించి పల్లెలో శాంతిభద్రతలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం కులాల మధ్య వైషమ్యాలు రగిల్చే వారిపై చర్యలు తీసుకుని, గ్రామంలోని ఐక్యతను కాపాడాలని చేవెళ్ల ఆర్డీవో గారిని కోరారు.



వర్షాలు లేక ఎండుతున్న పంటలు.. రైతులను ఆదుకోవాలి

తక్షణమే కంటింజెన్సీ ప్లాన్ ప్రకటించాలి

బీఆర్ఎస్ నేత బ్యాగరి సుదర్శన్



చేవెళ్ళ: వర్షాలు లేక పంటలు ఎండిపోతూ రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని బీఆర్ఎస్ నేత బ్యాగరి సుదర్శన్ డిమాండ్ చేశారు. ఎల్‌నినో ముప్పును దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులకు ప్రత్యామ్నాయ తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగుకు విత్తనాలను సబ్సిడీపై అందించాలని కోరారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, అందించడంతో పాటు పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల కష్టాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, పంటలు మరింత దెబ్బతినకముందే సమగ్ర కార్యాచరణ ప్రకటించి అన్నదాతలను ఆదుకోవాలని బ్యాగరి సుదర్శన్ డిమాండ్ చేశారు.

జగద్గిరిగుట్ట లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



జగద్గిరిగుట్ట,అక్టోబర్15(విజన్ పక్షం దినపత్రిక): తెలంగాణ ప్రజానాట్యమండలి మరియు భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గురు గుట్ట లాస్ట్ బస్ స్టాప్ వద్ద ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకుని వచ్చి బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరంగా గడిపారు.ఐక్యతను చాటి చెప్పే మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని చాటిచెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి.యూసుఫ్,ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ,భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన,సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హైమావతి, మాధవి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రమీల, వెంకటాచారి గౌరవాధ్యక్షులు ప్రవీణ్ భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె.లక్ష్మి జిల్లా ఆఫీస్ బేరర్లు మహాలక్ష్మి,చంద్రమ్మ, నీలమ్మ, దీపిక లతోపాటు స్థానిక సిపిఐ మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి రాములు హరినాథ్ రావు,వెంకటేష్ ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు యువజన సమైక్య అధ్యక్ష కార్యదర్శులు కీర్తి, ప్రవీణ్ సదానంద, సిపిఐ మరియు మహిళా సమాఖ్య కార్యకర్తలు వివిధ బస్తీల నుండి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



జగద్గిరిగుట్ట,అక్టోబర్15(విజన్ పక్షం దినపత్రిక): సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పరిధి వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు లక్షల రూపాయలతో బతుకమ్మ కుంట అభివృద్ధి పనుల కోసం నిధులను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అదేవిధంగా బోర్ వెయ్యడం కోసం అయిదు లక్షల రూ..లను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా స్థానికంగా బతుకమ్మ ఆడే ఆడపడుచులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకమ్మ కుంట శుద్ధి చేసి బంగారు బతుకమ్మలను ఆ కుంటలో వదిలేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.తాను కార్పొరేటర్ గా ఎన్నికైన నాటినుండి ప్రతి సంవత్సరం బతుకమ్మ కుంటను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని అన్నారు. తెలిపారు.ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈ బద్రు, ఏఈ ఆశ,వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్,సోమయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తోక యాదగిరి, మహేందర్,ప్రకాష్,ప్రభాకర్, కుమారస్వామి,నవీన్, సంపత్ రెడ్డి,సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిస్సైల్ మేన్ డా.ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు



నిజాంపేట,అక్టోబర్15(విజన్ పక్షం దినపత్రిక): భారత మాజీ రాష్ట్రపతి,భారతరత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా విచ్చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ...అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమైనవనికొనియాడారు.ఆయనను స్మరించుకుని నివాళులర్పించారు.కలాం జీవితం,ఆశయాలు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమనవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి,బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని,ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్మ వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్,కె.అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్,రఫత్, రామచంద్ర నాయక్, సరిత లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లా,నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ముస్తాబవుతున్న పరకాల అంగడి మైదానం!


లైటింగ్, పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్



పరకాల: పరకాల పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని గొడ్ల అంగడి మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మైదానంలో చేపడుతున్న విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పండుగ సందర్భంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, లైటింగ్ ఏర్పాట్లను సక్రమంగా పూర్తి చేయడంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బండి శ్రీధర్, అల్లె దశరథంతో పాటు పోరండ్ల వేణు, గొడుగు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో షేక్‌హ్యాండ్‌లు రాష్ట్రంలో

రాజకీయ సహజీవనం చేస్తున్న ఆ రెండు పార్టీలు!



అక్కడక్కడా ఒకటీ, రెండు చిన్న.. చిన్న సంపన్న దీవులున్న దారిద్ర్య మహా సాగరం మన దేశం

జనతా పార్టీ ప్రభుత్వ పతనానంతరం 1983లో ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కన్యాకుమారి నుంచి రాజ్‌ఘాట్ వరకు భారత యాత్ర పేరిట సుదీర్ఘ పాదయాత్ర చేసిన అనంతరం ఈ దేశ పరిస్థితి మీద చేసిన వ్యాఖ్య ఇది. ఇదేదో అలవోకగా ఊసుపోక చెప్పిన మాట కాదు. ఆరు నెలలకు పైగా సుదీర్ఘకాలం సుమారు 5 వేల కిలోమీటర్ల పొడవునా కొండలు, కోనలు, వాగులు, వంకలు, నదులు, దుర్గమారణ్యాలు దాటుతూ పాతిక ఇండ్లు కూడా లేని కుగ్రామాల నుంచి కాంక్రీట్ జంగిల్ వంటి మహా నగరాల దాక వందలాది గ్రామాలు, పట్టణాలు, నగరాలు, ఆవాసాలు అన్నీ సందర్శించి.. అక్కడి పరిస్థితులు పరిశీలించి ఆకళింపు చేసుకొని ఆ అనుభవంతో చెప్పిన మాటలివి. చంద్రశేఖర్ పర్యటన పొడవునా ఆకలి తాళలేక విషపు గడ్డలు తింటున్న వైనాలు, గుక్కెడు మంచి నీటికోసం కిలోమీటర్ల కొద్దీ కడవల మీద కడవలు పెట్టుకొని మహిళలు నడిచి వెళ్తున్న దృశ్యాలు.. పశువులు కొనలేక రైతు కుటుంబ సభ్యులే నాగలి లాగుతున్న ఘటనలు.. ఒక్కరంటే ఒక్కరు కూడా అక్షరాస్యుల్లేని గ్రామాలు రహదారులు, మరుగుదొడ్లు, పాఠశాలల్లేని పల్లెలు.. ఇలా ఎన్నెన్నో బాధలు ఆయన చూశారు. అదే సమయంలో నిరక్షరాస్యులైన ప్రజలు కూడా వార్తలు వినడానికి గ్రామ పంచాయతీ రేడియో మైకుల ముందు గుమిగూడిన చైతన్యాన్ని చూసి ఆశ్చర్యపడ్డారు. ఆ రోజుల్లో ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని రేడియోలో వార్తలను ప్రజలంతా వినగలిగేలా బయట మైకు పెట్టి ప్రసారం చేసేవారు. స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి నలభై ఏండ్లు. అయినా దేశ పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. దారిద్ర్యం, నిరక్షరాస్యత, ఆకలికేకలు, వలసలు అన్నీ అప్పటిదాకా కేంద్రాన్ని ఏలిన జాతీయపార్టీలు దేశానికి వారసత్వంగా అందించిన కానుకలు! అప్పుడే కాదు ఇప్పటికీ పరిస్థితి ఏమీ మారలేదు. దారిద్ర్య సాగరం వంటి ఈ దేశంలోని ప్రజల దుర్భర పేదరికాన్ని.. అవసరాలను.. అమాయకత్వాన్ని ఎన్నికల్లో నిస్సిగ్గుగా వాడేసుకొని కల్లబొల్లి హామీలిచ్చి ఆ తర్వాత కాడి పారేయడంలో అన్నింటికన్ని పార్టీలు ఆరితేరాయి. ప్రజల అమాయకత్వం పెట్టుబడిగా దొంగ హామీల రాజకీయాలను నడపడంలో కాంగ్రెస్ ఆరితేరితే మతాన్ని ఆలంబనగా చేసుకొని రెచ్చగొట్టి ఓట్లు కొల్లగొట్టడంలో నాలుగాకులు ఎక్కువే చదివిన పార్టీ బీజేపీ. దేశమంతా కొట్టుకునే ఈ రెండు పార్టీలు తెలంగాణ రాజకీయాల్లో మాత్రం చెట్టాపట్టాలేసుకు తిరుగుతున్నాయి. బీఆర్ఎస్‌ను దెబ్బ కొట్టడం అనే ఏకైక లక్ష్యంతో రాజకీయ సహజీవనం చేస్తున్నాయి. కాంగ్రెస్ కాలికి ముల్లు గుచ్చితే బీజేపీ కంట నీరుబుకుతుంటే.. బీజేపీ కాలికి దెబ్బ తాకితే కాంగ్రెస్ నొప్పితో బాధపడుతున్నది. ప్రతి వ్యవహారంలోనూ చీకటి రాత్రి షేక్‌హ్యాండ్ రాజకీయాలే. తాజాగా లో ఈ బంధం పట్టపగలు నగ్నంగా బయటపడింది. అసలు అవినీతికి ఆస్కారమే లేని అంశంలో రాష్ట్రం ఏసీబీ కేసు పెడితే.. ఆ వెంటనే కేంద్రం ఈడీ కేసు పెట్టడమే దీనికి ప్రబల సాక్ష్యం. అంతేకాదు, ఏదో జరిగిపోయినట్టు కాంగ్రెస్ కథలల్లి మీడియాలో వెదజల్లుతుంటే.. బీజేపీ నాయకులు అరెస్టు చేయాలని జైల్లో పెట్టాలని దానికి తాలింపు వేస్తున్నారు. కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలకు దిగుతుంటే వెనకుండి బీజేపీ సహకరిస్తున్నది. వాస్తవానికి ప్రజల మేలు కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వం లేదా మంత్రులు నిర్ణయాలు తీసుకుంటారు. ప్రతి నిర్ణయం క్యాబినెట్ తీర్మానం జరిగాకే చేయాలంటే కుదరదు. కొన్ని అంశాల్లో తక్షణమే స్పందించాల్సి ఉంటుంది. ముందు నిర్ణయం తీసుకొని తర్వాత క్యాబినెట్‌లో ఆమోదింపజేసుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తున్నది. ఫార్ములా రేసులో కూడా తక్షణ స్పందన అవసరం కాబట్టే రాష్ట్రానికి మేలు జరిగే నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి వచ్చే ప్రభుత్వం క్యాబినెట్ దాన్ని ఆమోదించుకుంటుంది. ప్రభుత్వం అనేది కంటిన్యూ ప్రాసెస్ కాబట్టి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా అంతకుముందు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను ముందుకు తీసుకుపోవాలి. అది పక్కనబెట్టి కక్ష సాధింపు చర్యలకు దిగడం అనైతికం. ఇదే పద్ధతిలో రేపు రాఫెల్ కొనుగోళ్ల విషయంలో ఇంకో ప్రభుత్వం వచ్చి దాన్ని తిరగదోడి విచారణ జరిపితే ఏం జరుగుతుంది? దేశీయ బొగ్గు కొనుగోళ్లకు విదేశీ బొగ్గు కోటా తప్పనిసరి నిర్ణయాన్ని తిరగదోడితే ఎవరు జైలుకు వెళ్తారు? అలాగే మూసీ సుందరీకరణ, లగచర్ల భూముల సేకరణ విషయంలో రాబోయే ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే ఏం జరుగుతుంది? ఏ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అంతిమంగా అది ప్రజల ప్రయోజనాల కోసమా? లేదా అన్నదే ముఖ్యం. అది వదిలేసి రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు నడుపుతుంటే కేంద్రం దానికి వత్తాసు పలుకుతున్నది. ఇక్కడ ఏసీబీ కేసు నిలవదనే వార్తల మధ్య ఆగమేఘాల మీద ఈడీ కేసు నమోదు చేసింది. వేధింపులకు వ్యవస్థలను వాడుకోవడమనే దుర్మార్గమైన సంప్రదాయం పదేండ్ల నుంచే ప్రారంభమైంది. ఆ మధ్య అదానీపై అమెరికాలో కేసు అంశం మీద పార్లమెంట్‌లో బీభత్సం సృష్టించిన రాహుల్, విచిత్రంగా గత కొంతకాలంగా ఆ అంశాన్ని ప్రస్తావించడం మానేశారు. ఈ మధ్య జరిగిన వివిధ ఎన్నికల్లో కూడా ఎక్కడా ఆ అంశాన్ని పెద్దగా లేవనెత్తినట్టు లేదు. అదే సమయంలో కాంగ్రెస్ విధానానికి భిన్నంగా తెలంగాణ, కర్ణాటకలో అదానీ వ్యాపారాలు విస్తరిస్తున్నారు. ఇది దేనికి సూచిక? మనకు తెలియదు. దేశంలో అనేక రాష్ట్రాలున్నాయి. కొన్ని చోట్ల కాంగ్రెస్.. కొన్ని చోట్ల బీజేపీ అధికారంలో ఉన్నాయి. అక్కడ విపక్షంలో అనేక పార్టీలు ఉన్నాయి. సహజంగా విపక్షాలన్నీ కలిసి అధికార పార్టీ మీద పోరాటం చేస్తాయి. అలాగే ఏదైనా ఒక పక్షం మీద సర్కారు దమనకాండకు దిగితే మిగిలిన పక్షాలన్నీ కలిసికట్టుగా వ్యతిరేకిస్తాయి. తెలంగాణలో విచిత్రంగా విపక్ష బీఆర్ఎస్ నాయకులను ప్రభుత్వం వెంటాడి వేధిస్తున్నది. అయినా బీజేపీ ఇదేమని ప్రశ్నించడం లేదు. పైగా ఇంకా అరెస్టు చేయలేదు. జైల్లో పెట్టడం లేదు అంటూ ఆజ్యం పోస్తున్నది. కేంద్ర సంస్థలను కూడా రంగంలోకి దింపుతున్నది. ఇటు ప్రభుత్వం బీజేపీ నాయకుల మీద ఈగ వాలనివ్వడం లేదు. దీనికి తగ్గట్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ ఒక్కటంటే ఒక్క కీలక పోరాటం చేసిన దాఖలాల్లేవు. ఆ మాటకొస్తే గట్టిగా విమర్శించిన సందర్భాలు కూడా లేవు. రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్ మీద చీకటి రాజకీయాలతో విరుచుకుపడుతున్నాయి. నువ్వు ఇటు మొదలు పెట్టు.. నేను అటు అందుకుంటా.. అన్నట్టుంది వ్యవహారం.కాంగ్రెస్ మీద, రేవంత్ మీద రాష్ట్ర బీజేపీకి వల్లమాలిన అభిమానం. రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల గడిచీ గడవకముందే 'కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చేయాలని కేసీఆర్ కుట్ర పన్నారని' బండి సంజయ్ కరీంనగర్‌లో ఆరోపించారు. కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టులున్నారని ఆందోళన పడ్డారు. అలాంటిదేమన్నా ఉంటే కాంగ్రెస్ ఆందోళన పడాలి. హైరానా పడాలి. కాంతమ్మ నెల తప్పితే కనకమ్మకు నొప్పులొచ్చినట్టు.. మధ్యలో ఈయనకొచ్చిన బాధేమిటో? అర్థం కాదు. ఇంతేకాదు.. రేవంత్ మీద ప్రేమను బీజేపీ నాయకులు ఏనాడూ పెద్దగా దాచుకోలేదు. గత సెప్టెంబర్ 11న రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో రేవంత్ మీద తమకు నమ్మకం, గౌరవం ఉన్నాయని బండి సంజయ్ మీడియా ముందే ప్రకటించారు. గతంలో రేవంత్‌ను, ఆయన కార్యకర్తలను కేటీఆర్ వేధించారని బాధపడ్డారు. కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని రేవంత్‌ను డిమాండ్ కూడా చేశారు. ఇలా చెప్తూ పోతే ఎన్నో అంశాల్లో ఈ రెండు పార్టీల గొంతు ఒకటే.. రాష్ట్రంలో అధికారంలోకి రాకముందు వచ్చిన తర్వాత కాంగ్రెస్ పాడిన పాట ఒకటే. 'రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారు' అని. సరిగ్గా ఇదే పాటను బీజేపీ కూడా పాడింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల తర్వాత. పార్టీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో 'కేసీఆర్ లక్షల కోట్ల అప్పులు చేసి చిప్ప చేతికిచ్చాడు' అనే ఆణిముత్యాన్ని పార్టీ సీనియర్ నేత లక్ష్మణ్ వల్లె వేశారు. ఆరు గ్యారెంటీల బారినుంచి తప్పించుకోవడానికి కాంగ్రెస్ పాడుతున్న ఈ పాటనే బీజేపీ ఎత్తుకోవడం వెనుక ఏ లక్ష్యం ఉన్నట్టు? వాస్తవానికి ఏటా బడ్జెట్‌లో ఆస్తులు అప్పుల చిట్టా ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటో ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌కు తెలుసు. అయినా ఆరు గ్యారెంటీలు ప్రకటించారు. అలాంటపుడు 'ఆచరణ సాధ్యం కాని హామీలు ఎందుకిచ్చారు?' అని కాంగ్రెస్‌ను నిలదీయాల్సిన బీజేపీ, కాంగ్రెస్‌కు వత్తాసు పలికేలా మాట్లాడటం విచిత్రం. 'బీఆర్ఎస్ పనైపోయింది' అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం బీజేపీ ఆరున్నొక్క రాగంతో చేసిన ప్రచారం ఇది. అటూఇటుగా కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ ఖాళీ అవుతుందనే ప్రచారమూ చేసింది. 39 ముక్కలు చేస్తానన్నాడో మంత్రి పుంగవుడు. మరో మంత్రి పొంగులేటి బీఆర్ఎస్ పని క్లోజ్ అని ప్రకటిస్తే బీజేపీ ఎంపీ రఘునందన్ ఇంకో 15 నెలల్లో బీఆర్ఎస్సే ఉండదన్నారు. కిషన్‌రెడ్డి ఇదే అన్నాడు. అంటే.. ఈ రెండు పార్టీల మైండ్ వేవ్‌లెన్త్ ఒకే దిశగా పయనిస్తున్నాయనేది సుస్పష్టం. ఇక బీఆర్ఎస్ అగ్రనేతలపై కాంగ్రెస్ కేసులు, విచారణలతో వేధిస్తుంటే బీజేపీ వారిని అరెస్టు చేయాలని, జైల్లో పెట్టాలని డిమాండ్ చేస్తుంటుంది. ఈ విషయంలోనూ రెండింటి వేవ్‌లెన్త్ ఒకటే. పైకి మాత్రం ఈ రెండు పార్టీలు ఒకటి బీఆర్ఎస్-బీజేపీ ఒకటే అని ప్రచారం చేస్తే మరో పార్టీ బీఆర్ఎస్-కాంగ్రెస్ ఒకటేనంటూ ప్రచారాలు చేస్తాయి. మూసీ వ్యవహారమే చూడండి రేవంత్ సర్కార్ మూసీ సుందరీకరణ పేరుతో అక్కడ వందల ఇండ్లను కూల్చివేసింది. దీన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బీఆర్ఎస్ రాజకీయ పోరాటానికి దిగింది. బీఆర్ఎస్ రాజకీయ గ్రాఫ్ పెరుగుతుందనే సంకేతాలు రాగానే దానికి అడ్డుకట్ట వేయడానికి ఆ వెంటనే బీజేపీ రంగంలోకి దిగి పర్యటనలు, మూసీ నిద్రలు ప్రారంభించింది. అంతేకాదు, అసలు మూసీ బ్యూటిఫికేషన్ పథకం మొదలుపెట్టింది బీఆర్ఎస్సేనని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అయితే, బీఆర్ఎస్ తలపెట్టిన పథకం ఏమిటి? రేవంత్ అమలు చేసిన పథకం ఏమిటి? మూసీ పొడవునా ఇండ్లను తొలగించి భారీ నిర్మాణాలు, కార్పొరేట్ కంపెనీల ఏర్పాటు అనేది రేవంత్ పథకమైతే.. మూసీ ప్రక్షాళన, ఇరువైపులా రహదారులు, పార్కులతో సుందరీకరణ అనేది బీఆర్ఎస్ ప్రణాళిక. రెండింటి మధ్య బడ్జెట్ విషయంలో కూడా నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉన్నది. అయినా అర్జెంటుగా బీఆర్ఎస్ గ్రాఫ్‌ను దెబ్బకొట్టి రేవంత్‌ను కాపాడాలనే తపన బీజేపీలో కనపడింది. ఇక ఫోన్‌ట్యాపింగ్ కేసు విషయంలో కాంగ్రెస్ రోజుకో ఆరోపణ చేస్తూ పోతుంటే బీజేపీ నేతలు అదే రాగంలో సీబీఐ విచారణ జరపాలన్నారు. గవర్నర్, ఈసీ కలుగజేసుకోవాలన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలని కూడా అన్నారు. అదే పార్టీకి చెందిన రఘునందన్ కేసీఆర్‌ను ఎందుకు విచారించడం లేదని ప్రశ్నిస్తారు. అంటే సబ్జెక్ట్ ఏదైనా బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టడమే రెండు పార్టీల ఏకైక లక్ష్యమనేది తేటతెల్లం. కృష్ణా జలాల విషయంలో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ కేంద్రం చేతికి అప్పగించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రభుత్వ అసమర్థతను ఎండగట్టింది. ఈ దశలో బీజేపీ కేంద్ర మంత్రి బండి సంజయ్ రంగప్రవేశం చేసి అసలు కృష్ణా జలాల వాటాను ఏపీకి కేసీఆరే తాకట్టు పెట్టారని ఆరోపించారు. అంతేకాదు, ఆ వాటాను కేసీఆర్ వినియోగించకపోవడం వల్ల రాష్ట్రం పూర్తిగా ఎడారిగా మారిందని కూడా అన్నారు. మరి కేసీఆర్ ఏ నీటిని వాటా రాసిచ్చారో.. ఆ నీరు అందక రాష్ట్రంలో ఎక్కడ ఏ మడి ఎండిందో.. ఎక్కడ కొత్తగా ఎడారి పుట్టుకొచ్చిందో ఆయనకే తెలియాలి. ఇంకా విచిత్రమైన విషయం ఏమంటే 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి ప్రకటిస్తే%ా% అదే వేవ్‌లెన్త్‌లో బీఆర్ఎస్ నుంచి 25 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటిస్తారు. ఇలాంటి ప్రకటన ఇస్తే గిస్తే కాంగ్రెస్ వాళ్లు చేయాలి. ఎందుకంటే ఎమ్మెల్యేలు టచ్‌లో ఉండేది ఆ పార్టీ నాయకులతో కాబట్టి. మరి బీజేపీ నాయకులు ఈ విషయం ప్రకటించడమేమిటి? కాంగ్రెస్‌కు వెళ్లే వాళ్లు ముందుగా బీజేపీ దగ్గర పేరేమన్నా నమోదు చేసుకున్నారా?మనకు తెలియదు. రేవంత్‌ను 'లొట్ట సు సీఎం' అంటే కాంగ్రెసోల్లకంటే బండి సంజయ్‌కే ఎక్కువ కోపం వచ్చింది. సీఎంను పట్టుకొని అలా అన్నందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీకి చెందిన ఇంకో ఎంపీ 'నీ పౌరుషం చచ్చిపోయిందా రేవంత్?' అని రెచ్చగొట్టాడు. 'నిన్ను అర్ధరాత్రి అరెస్టు చేశారు. ఓటుకు నోటు కేసులో ఆరు నెలలు జైల్లో పెట్టారు' అంటూ గుర్తుచేశారు. 'నువ్వు ఏమి చేయడం లేదు' అంటూ వెక్కిరింతలకు దిగాడు. ఎందుకంత దుగ్ధ? దేశ రాజకీయాల్లో కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ పుట్టిన పార్టీ తెలుగుదేశం. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీతో పోరాడితే ఆ బీజేపీతో కూటమి కట్టి చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఆ కూటమి ప్రభుత్వానికి చెందిన చంద్రబాబును రేవంత్‌రెడ్డి ఆహ్వానించి ఇరు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం పేరుతో ఒక సమావేశం జరిపారు. దేశ రాజకీయాలు దృష్టిలో పెట్టుకున్నా.. రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకున్నా బీజేపీ ఒక పార్టీగా దీన్ని సమర్థించకూడదు. కానీ, చిత్రంగా రాష్ట్ర బీజేపీ ఈ సమావేశాన్ని స్వాగతించింది. బండి సంజయ్ ఈ సమావేశాన్ని ప్రస్తుతించారు. పోయిన ఏప్రిల్‌లో రైతులు సాగునీటి సమస్యతో అల్లాడారు. ఈ సమస్యపై పోరాటంలో భాగంగా కేసీఆర్ కరీంనగర్ పర్యటన ప్రకటించారు. వ్యతిరేకిస్తే గిస్తే దాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించాలి. కానీ, చిత్రంగా బండి సంజయ్ ఆ పర్యటనను వ్యతిరేకించారు. కేసీఆర్ కరీంనగర్ పర్యటనకు రావొద్దన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ రైతులను పట్టించుకోనేలేదన్నారు. వాస్తవానికి స్వాతంత్ర్యానంతరం దేశంలో రైతు మాడల్ అమలుచేసిన రాష్ట్రం అంటూ ఏదన్నా ఉందంటే అది ఒక్క తెలంగాణే. కేసీఆర్ పాలన సాగిన పదేండ్లూ రైతులు కుదుటపడ్డారు. ఇటీవలి ఆర్బీఐ నివేదిక కూడా ఆ విషయాన్ని బయటపెట్టింది. గమ్మత్తేమిటంటే ఇక్కడి రైతుబంధును కాపీ కొట్టి కేంద్రం పీఎం కిసాన్ యోజన పథకాన్ని అమలుచేస్తున్నది. అయినా అవేవీ పట్టకుండా సంజయ్ కేసీఆర్ పర్యటన మీద అంతెత్తున ఎగిరారు. సరే.. కేసీఆర్ ఇవేవీ పట్టించుకోకుండా నల్లగొండ, సూర్యాపేట, జనగామల్లో పర్యటనలు జరిపారు. దీనికి ప్రజల్లో మంచి స్పందన లభించింది. ఆ వెంటనే బీజేపీ కూడా రైతు దీక్ష అంటూ రంగంలోకి దిగింది. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో దీక్ష అని ప్రకటించి ఉదయం 10 గంటలకు దీక్ష ప్రారంభించి మధ్యాహ్నం 2 గంటలకు.. అంటే 4 గంటల దీక్షతో సరిపెట్టారు. రాష్ట్ర రాజకీయాలను కుదిపేసిన సంఘటన లగచర్ల రైతుల తిరుగుబాటు. ఈ అంశంలో బీజేపీ ప్రభుత్వాన్ని పల్లెత్తి మాట్లాడింది లేదు. రైతులను ఓదార్చి సంఘీభావం చెప్పింది లేదు. రాజకీయ లబ్ధి అనే ఏకైక లక్ష్యంతో పార్టీని కొంతకాలం నిలబెడుతుందేమో గానీ బీజేపీ విపక్షంగా తన బాధ్యతను విస్మరించడాన్ని ప్రజలు సహించరు. ప్రాచీన సాహిత్యంలో పాము,ఎలుక కథ ఒకటుంది. ఓ పాడుబడిన ఇంట్లో ప్రవేశించిన ఎలుక అక్కడ ఓ పెట్టెలో ఏదో ఆహారముందని భ్రమించి కష్టపడి దానికి రంధ్రం చేసి లోనికి ప్రవేశించింది. అందులో ఏముంది? ఎవరో ఓ పామును అక్కడ బంధించి ఉంచారు. చాలా రోజులుగా బయటకువెళ్లే మార్గం లేక, ఆహారం లేక చచ్చే స్థితిలో ఉన్న సదరు పాముబీ రంధ్రం ద్వారా లోనికి వచ్చిన ఎలుకను తినేసి ఆ ఎలుక చేసిన రంధ్రం నుంచి హాయిగా బయటకు వెళ్లి పోయింది. ఇందులో ఎలుక ఎవరో.. పాము ఎవరో చెప్పనవసరం లేదు!! రేవంత్‌ను 'లొట్ట సు సీఎం' అంటే కాంగ్రెసోల్లకంటే బండి సంజయ్‌కే ఎక్కువ కోపం వచ్చింది. సీఎంను పట్టుకొని అలా అన్నందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీకి చెందిన ఇంకో ఎంపీ 'నీ పౌరుషం చచ్చిపోయిందా రేవంత్?' అని రెచ్చగొట్టాడు. 'నిన్ను అర్ధరాత్రి అరెస్టు చేశారు. ఓటుకు నోటు కేసులో ఆరు నెలలు జైల్లో పెట్టారు' అంటూ గుర్తుచేశారు. 'నువ్వు ఏమి చేయడం లేదు' అంటూ వెక్కిరింతలకు దిగాడు. ఎందుకంత దుగ్ధ?

దేశం గుర్తించని హీరో రిచారియా



డాక్టర్ రాధేలాల్ హరేలాల్ రిచారియా.. చాలామందికి పరిచయం లేని పేరిది. దేశీయ విత్తన వారసత్వానికి దృఢమైన రక్షకుడిగా నిలబడిన ఆయన ఇప్పటికీ అగ్రికల్చర్ యూనివర్సిటీలు, ఆ రంగంలోని శాస్త్రవేత్తలకు అపరిచితుడే. వివిధ పంటలపై ముఖ్యంగా వరిపై విస్తృత పరిశోధనలు చేసిన రిచారియా గురించి ఏ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పాఠ్యాంశంలోనూ ఆయన కనిపించకపోవడం విషాదం. రిచారియా 1990లో మధ్యప్రదేశ్‌లోని హొషంగాబాద్ జిల్లా, నందన్‌వర గ్రామంలో జన్మించారు. తండ్రి స్థానిక పాఠశాలలో హెడ్మాస్టర్‌గా, పోస్ట్‌మాస్టర్‌గానూ పనిచేశారు. తండ్రితో కలిసి పొలానికి వెళ్లినప్పుడే ఆయనకు వ్యవసాయం ఒంటబట్టింది. తమకున్న చిన్న కమతంలోనే వివిధ రకాల కూరగాయలపై ప్రయోగాలు చేసేవారు. పొరుగునే ఉన్న గిరిజన గ్రామాల్లో అరుదైన వ్యవసాయ మొక్కలు గుర్తించేవారు. నాగ్‌పూర్‌లో బాటనీలో ఎంఎస్సీ పూర్తిచేశాక ఇంగ్లండ్‌లో పీహెచ్‌డీ చేయాలని అనుకునేవారు. పరిశోధనలు రైతులకు ఉపయోగపడితేనే అవి విజయం సాధించినట్టు అని చెప్పే కేంబ్రిడ్జి యూనివర్సిటీలోని ప్రొఫెసర్ పీఎస్ హడ్సన్‌ను కలవాలని కలలు కనేవారు. 1931లో నాగ్‌పూర్‌లోని ఓ కంపెనీలో ఆయిల్‌సీడ్ నిపుణుడిగా ప్రారంభమైన ఆయన జీవితంలో ఎన్నో ప్రయోగాలకు బీజం పడింది అక్కడే. 1942లో మహాత్మాగాంధీని సైతం ఆశ్చర్యపరుస్తూ అవిసె గింజల కాండాల నుంచి మొత్తని నారను తీయడంలో రిచారియా విజయం సాధించారు. ఆ సమయంలో ఆయన బీహార్‌లోని సబౌర్ అగ్రికల్చర్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో కలిసి పనిచేస్తూ ఈ విజయం సాధించారు. అప్పట్లో మన దేశం విదేశాల నుంచి నారను దిగుమతి చేసుకునేది. రిచారియా ప్రయోగం తర్వాత నారను దిగుమతి చేసుకోవడం మాని ఇక్కడే తయారుచేసుకోవాలని బీహార్ చరఖా సంఘాన్ని గాంధీ కోరారు. 1959 నుంచి 1966 వరకు కటక్‌లోని సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ) డైరెక్టర్‌గా, 1971 నుంచి 1978 వరకు మధ్యప్రదేశ్ వరి పరిశోధనా సంస్థ (ఎంపీఆర్ఆర్ఐ) డైరెక్టర్‌గా రిచారియా పనిచేశారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగానూ వ్యవహరించారు. కటక్‌లో పనిచేస్తున్నప్పుడు తెగుళ్ల నిరోధకతను కలిగే జపోనికా సంప్రదాయ వరి టైచుంగ్ నేటివ్ వన్ (టీఎన్ఐ) నుంచి కొన్ని రకాల వంగడాలను ఎంచుకుని పరిశోధనలు చేశారు. 1942లో వరి క్లోనింగ్‌పైనా దృష్టిసారించారు. ఇది దిగుబడిని అసాధారణంగా పెంచడమే కాకుండా విత్తనాలను ఆదా చేసింది. సాధారణ మార్పిడి మొక్కలతో పోల్చినప్పుడు దిగుబడిలో 17 నుంచి 61 శాతం పెరుగుల కనిపించింది. అంతేకాదు, ఇవి తెగుళ్లు, వ్యాధుల నుంచి తమను తాము రక్షించుకోగలవు కూడా. 1962లో రిచారియా పరిశోధన వ్యాసం ప్రముఖ సైన్స్ జర్నల్ 'నేచర్'లో ప్రచురితమైంది. ఆ తర్వాత అది 1963లో అంతర్జాతీయ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ)కి ప్రమోట్ అయింది. సీఆర్ఆర్ఐ ప్రపంచంలోనే అత్యుత్తమ వరి పరిశోధన కేంద్రం అవుతుందని రిచారియా విశ్వసించేవారు. అయితే, అంతర్జాతీయ సమాజం మాత్రం జపోనికా క్రాసెస్‌పైనే సీఆర్ఆర్ఐ పనిచేయాలని ఒత్తిడి తీసుకురావడంతో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నారు. జపోనికా వంగడాల్లో భారత్‌కు తెలియని టుంగ్రో వైరస్ వంటి తెగుళ్లు ఉన్నాయని, జపోనికా వరి భారత్‌లోకి ప్రవేశిస్తే దేశం మొత్తం ఈ తెగుళ్లు విస్తరిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఊహించినట్టే ఇప్పుడు అదే జరుగుతున్నది. వ్యవసాయ రంగంలో అనేక పరిశోధనలతో దేశంలోనే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్తగా గుర్తింపు తెచ్చుకున్న రిచారియాను సీఆర్ఆర్ఐ డైరెక్టర్ పదవి నుంచి ప్రభుత్వం తొలగించి అవమానించారు. ఆయన అధికారిక నివాసానికి నీటి, విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. దీంతో ఆయన ఒరిస్సా హైకోర్టుకెళ్లి విజయం సాధించారు. కోర్టు తీర్పుతో ఆయన కార్యాలయానికి వెళ్తే తాళం వేసి కనిపించింది. అందులోని ఆయన రీసెర్చ్ పేపర్లను అధికారులు తీసుకెళ్లినట్టు గుర్తించారు. 1971లో రాయ్‌పూర్‌లోని మధ్యప్రదేశ్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఎంపీఆర్ఆర్ఐ)లో డైరెక్టర్‌గా చేరారు రిచారియా. మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి అగ్రికల్చర్ కన్సల్టెంట్‌గానూ పనిచేశారు. 1976లో మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ప్రపంచబ్యాంకు రూ. 4 లక్షల రుణం ఇచ్చి ఎంపీఆర్ఆర్ఐని జబల్‌పూర్‌లోని జవహర్‌లాల్ కృషి విద్యాలయంలో విలీనం చేయాలని కోరింది. ఇది ఆశాజనకమైన, అధిక దిగుబడినిచ్చే దేశీయ రకాలను ప్రాచుర్యంలోకి తేవాలన్న రిచారియా ప్రయత్నానికి గండికొట్టింది. 1971-1976 మధ్య రిచారియా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 17 వేల రకాల దేశీయ వరిని సేకరించారు. 967 రకాలను ట్రయల్స్ కోసం 17 జిల్లాలకు పంపించారు. వీటిలో స్వల్ప కాలంలో చేతికి వచ్చే అరోమాటిక్ రైస్, కోర్స్, ఫైన్ వంటి 237 రకాలు వంగడాలు కూడా ఉన్నాయి. సబౌర్‌లోని బీహార్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఉన్నప్పుడు 'రాటూనింగ్' అనే వరి రకాన్ని గుర్తించారు. రాటూనింగ్ అనేది ఒక వ్యవసాయ పద్ధతి. కోత తర్వాత మొక్క పైభాగాన్ని కత్తిరించడం ద్వారా కొత్త పెరుగుదలకు ఇది బాటలు వస్తుంది. అలాగే, 44 క్లస్టర్ వరి రకాలను సేకరించారు. వీటిని ఇతర బియ్యంతో సులభంగా సంక్రమణం చేయవచ్చు. క్యాన్సర్ నివారణ మూలకాలతో కూడిన 22 రకాల పర్పుల్ లీఫ్ వరి రకాలను కూడా రిచారియా గుర్తించారు. దేశంలో వరి ఉత్పత్తిని పెంచాలని 1983లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ రిచారియాను కోరారు. 1996లో ఆయన చనిపోయే వరకు 2 వేల సంప్రదాయ వరి రకాలపై పనిచేశారు. ఇంత చేసినా ఆయన కెరీర్‌పై సైన్స్ పాలిటిక్స్ తీవ్ర ప్రభావం చూపించాయని చాలామంది నమ్ముతారు. ఇప్పటికీ ఆయన వేల రకాల దేశీయ వరి వంగడాల్లో బతికే ఉన్నారు. దేశంలో పలు చోట్ల అవి ఇంకా ప్రజల ఆకలి తీరుస్తూనే ఉన్నాయి.

రోజూ ఇలా చేయండి చాలు మీ కిడ్నీలు సేఫ్‌గా ఉంటాయి


మన శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాల్లో కిడ్నీలు కూడా ఒకటి. కిడ్నీలు నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటాయి. ఇవి మన శరీరంలో ఎప్పటికప్పుడు పేరుకుపోయే వ్యర్థాలను బయటకు పంపుతూనే ఉంటాయి. ఈ క్రమంలో మనం నిద్రపోయినా కూడా కిడ్నీలు పనిచేస్తూనే ఉంటాయి. అందుకనే ఉదయం నిద్ర లేవగానే మనం మల మూత్రాలను విసర్జించాల్సి వస్తుంది. అయితే ప్రస్తుత తరుణంలో మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, ఇతర కారణాల వల్ల చాలా మందికి కిడ్నీ వ్యాధులు వస్తున్నాయి. ముఖ్యంగా చాలా మందికి కిడ్నీలు పాడవడమో లేదా కిడ్నీ స్టోన్స్ రావడమో జరుగుతోంది. అయితే రోజూ ఉదయం పలు జాగ్రత్తలను పాటిస్తే చాలు.. దాంతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ఉదయం కొన్ని అలవాట్లను పాటిస్తే కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. ఇక ఆ అలవాట్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

నీళ్లు..

రోజూ ఉదయం నిద్ర లేవగానే చాలా మంది బెడ్ టీ లేదా కాఫీ తాగుతారు. ఇలా తాగడం మంచిది కాదు. దీంతో శరీరంపై భారం పడుతుంది. ముఖ్యంగా కిడ్నీలపై ఒత్తిడి పడుతుంది. అలా కాకుండా ఈ పానీయాలకు బదులుగా గోరు వెచ్చని నీటిని ఒక లీటర్ మోతాదులో తాగాలి. దీంతో కిడ్నీల్లోని వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. కిడ్నీలపై భారం పడకుండా ఉంటుంది. రోజంతా కిడ్నీలు ఆరోగ్యంగా, చురుగ్గా పనిచేస్తాయి. వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపిస్తాయి. అదేవిధంగా రోజూ వ్యాయామం చేయడం వల్ల కూడా శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. రోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాల్సి ఉంటుంది. కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్ అయినా చేయాలి. దీంతో కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

ఆహారం..

కిడ్నీలకు మేలు చేసే ఆహారాలను తినడం వల్ల కూడా కిడ్నీల ఆరోగ్యం మెరుగు పడుతుంది. ముఖ్యంగా బెర్రీలు, ఆకుకూరలు, ఆలివ్ ఆయిల్ వంటి వాటిని ఉదయం ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇవి కిడ్నీల పనితీరును మెరుగు పరుస్తాయి. కిడ్నీల వాపులు తగ్గేలా చేస్తాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలను తీసుకోవాలి. ఇవి కిడ్నీలలో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు పోయేలా చేస్తాయి. దీంతో కిడ్నీలకు కావల్సిన పోషకాలు లభిస్తాయి. కిడ్నీల పనితీరు మెరుగు పడుతుంది. కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి.



హెర్బల్ టీలు..

హెర్బల్ టీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కూడా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. హెర్బల్ టీలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి కణాలను రక్షిస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు పోయేలా చేస్తాయి. దీంతో కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. ఫలితంగా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే షుగర్ లెవల్స్‌ను ఎప్పటికప్పుడు నియంత్రణలో ఉంచుకోవాలి. షుగర్ ఎక్కువగా ఉండే కిడ్నీలపై భారం పడుతుంది. పదే పదే మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలు ఎక్కువగా పనిచేస్తాయి. దీర్ఘకాలంలో ఇలా జరిగితే కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. కనుక షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవాలి. ఇలా కొన్ని చిట్కాలను, జాగ్రత్తలను పాటిస్తే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. కిడ్నీల పనితీరు మెరుగు పడడమే కాక, కిడ్నీ స్టోన్లు కూడా రాకుండా అడ్డుకోవచ్చు.

Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980